ప్రజాశక్తి
ఆదివారం 16 ఏప్రిల్ 2023
5
విజయనగరం



జ్యూట్ కార్మికుల పిఎఫ్ సొమ్ము చెల్లించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

శ్రీలక్ష్మీ శ్రీనివాస జ్యూట్ కార్మికుల పిఎఫ్ బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జ్యూట్ కార్మికుల పిఎఫ్, గ్రాడ్యుటీ బకాయిలు చెల్లింపునకు ఎమ్మెల్యే సమక్షంలో ఒప్పందం జరిగినప్పటికీ 760మంది నూతన పర్మినెంట్, బదిలీ కార్మికులకు రూ. కోటి 60లక్షలు పిఎఫ్ బకాయి చెల్లించాల్సి ఉన్న చెల్లించకపోవడంతో పిఎఫ్ పెన్షన్ రావడం లేదని అన్నారు. పెన్షన్ అందకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పిఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, కార్మికుడు రాంబాబు ఉన్నారు.



గ్యాస్ గోడౌన్ తాళాలను అప్పగిస్తున్న అధికారులు

హెచ్‌పి గ్యాస్ గోదాం అప్పగింత

- అక్రమ నిర్మాణమంటూ రెండేళ్ల క్రితం కూల్చేసిన అధికారులు
- కోర్టు ఆదేశాలతో మళ్లీ నిర్మించి అప్పగించిన వైనం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

అక్రమ నిర్మాణమంటూ పూసపాటిరేగలోని గాయత్రి గ్యాస్ ఏజెన్సీస్‌కి చెందిన హెచ్‌పి గ్యాస్ గోదామును రెండేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు జెసిబిలతో కూల్చేశారు. ఈ విషయమై గోదాం యజమాని బూర్లె శ్రీధర్ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి తహశీల్దార్ విజయ భాస్కర్ రాజకీయ వత్తిళ్లతో కావాలనే అక్రమ నిర్మాణమంటూ కూల్చేసారని కోర్టుకి వెళ్లారు. గోదామును కూల్చే హక్కు అధికారులకు ఎవరిచ్చారంటూ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాగున్న నిర్మాణాన్ని అలాగే సొంత నిధులతో నిర్మించి యజమానికి అప్పగించాలంటూ ఏడాది క్రితం తహశీల్దార్ విజయభాస్కర్‌కు కోర్టు ఆజ్ఞాపించినట్లు తెలిసింది. తహశీల్దార్ సొంత నిధులతో గ్యాస్ గోదాం నిర్మాణం పూర్తి చేశారు. నిర్మాణం పూర్తి చేసినా అప్పగించకపోవడంతో యజమాని మరోసారి కోర్టును ఆశ్రయించారు. వెంటనే గోదామును యజమాని శ్రీధర్ కు అప్పగించాలంటూ అప్పటి తహశీల్దార్ పి విజయ భాస్కర్‌తోపాటు ప్రస్తుత తహశీల్దార్ ఇమంది భాస్కరరావుకు కోర్టు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో వెంటనే జిల్లా అధికారులతో పాటు మండల రెవెన్యూ అధికారి భాస్కరరావు, పూర్వపు తహశీల్దార్ విజయ భాస్కర్ శనివారం ఉదయం గోదాం తాళాలను శ్రీధర్‌కు పోలీసుల సమక్షంలో అప్పగించారు. వెంటనే ఆయన గోదామును స్వాధీనం చేసు కొన్నారు. గాయత్రి గ్యాస్ ఏజెన్సీస్ బోర్డులు ఏర్పాటు చేసి గ్యాస్ అమ్మకాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యాస్ గోదాం యజమాని బూర్లే శ్రీధర్ మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితమే కోర్టు ఉత్తర్వులు జిల్లా అధికారులు మండల అధికారులకు వచ్చాయన్నారు. తన గోదాం అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.

కలెక్టర్ విస్తృత పర్యటన

ఉపాధి హామీ పనుల తనిఖీ ● భూముల రీసర్వే ప్రక్రియ పరిశీలన



ఉపాధి మస్తర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-చీపురుపల్లి, గరివిడి

జిల్లాలోని పలు మండలాల్లో కలెక్టర్ నాగలక్ష్మి శనివారం విస్తృతంగా పర్యటించారు. చీపురుపల్లి, గరివిడి, తదితర మండలాల్లో పర్యటించి, వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను పరిశీలించారు. ఆకస్మిక తనిఖీలను నిర్వహిం చారు. గరివిడి మండలం కొండలక్ష్మీపురం, బాగువలస గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఆకస్మికంగా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఉపాధి హామీ మస్తర్లను తనిఖీ చేశారు. ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడి, వారి సమస్యలను, సగటు వేతనాన్ని తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రతిఒక్కరూ తమతోపాటుగా నీళ్ల సీసాను తెచ్చుకోవాలని సూచించారు. పనిచేసే చోట మెడికల్ కిట్‌ను తప్పనిసరిగా ఉంచాలని, టెంట్ వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, డిఎల్‌డిఒ లక్ష్మణ్, తహశీల్దార్ టి.గోవింద, ఎపిఒ రత్నమాల, సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వికలాంగుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. గరివిడిలోని శ్రీరామ్ జూనియర్ కాలేజీ ఆవరణలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆలిమ్ కో సంస్థ సహకారంతో ఉపకరణాల పంపిణీ కోసం గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగుల పునరావాసం, సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో ఇటువంటి గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేసి, వికలాంగుల అవసరాలను గుర్తించి, అవసరమైన వాటిని పంపిణీ చేయు విధానం మొదటిగా విజయనగరం జిల్లాలోనే ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్ కుమార్, డిప్యూటీ సిఇఒ రాజ్‌కుమార్, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

ప్రజాశక్తి-కొత్తవలస

దేశ ప్రజలను విచ్ఛిన్నం చేసేలా బిజెపి అనుసరిస్తున్న మనువాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సిపిఎం నాయకులు గాడి అప్పారావు అన్నారు. శనివారం ఉపాధి పనుల వద్ద ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మనువాద సిద్ధాంతాలను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కాలరాసేందుకు చూస్తోందని ధ్వజమెత్తారు. దీన్ని యావత్తు ప్రజలంతా తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, సింహాచలం పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు అప్పారావు



ఇంటింటికీ ప్రచారం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

వైసిపి హయాంలోనే అభివృద్ధి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి హయాంలోనే రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి చెందిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరం మండలంలోని కొండకరకాం లో గడపగడపకు మన ప్రభుత్వం నాలుగో రోజు కార్యక్రమం శనివారం చేపట్టారు. కోలగట్ల వీరభద్ర స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. వారి కుటుంబంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి ఎంత మేర కలిగింది? వాటిని వారు ఏ విధంగా సద్వినియోగం చేసుకున్నారు? అని తెలుసుకున్నారు. ఇంకేమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని అడగడమే కాక, మౌలిక సదుపాయాలు అవసరం అయిన చోట వెను వెంటనే వాటికి పరిష్కారం చూపారు. మరోసారి తనకు మద్దతు పలకాలని కోరారు.

ఈ సందర్భంగా పిఎసిఎస్ అధ్యక్షులు కెల్ల త్రినాథ్, గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డి ఆదినారాయణ విలేకరులతో మాట్లాడారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తానున్నాను అంటూ భరోసా ఇస్తోన్న ప్రజల మనిషి కోలగట్ల వీరభద్ర స్వామి అని చెప్పారు. సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదే అన్నారు. గతంలో విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడే వారని, ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామంలోనే లభ్యమవుతున్నాయని తెలిపారు. రేషన్ సరుకులు సైతం నేడు ఇంటి ముంగిటకే వస్తున్నాయన్నారు. అర్హులై ఉండి, ఏదైనా కారణంతో పేదలు పథకాలకు దూరమైతే.. తెలుసుకొని పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం దోహదపడుతోందన్నారు. ఇది మహిళా ప్రభుత్వమని.. అందుకే అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలన్నీ నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కిలారి రాంబాబు, ఎంపిటిసి సభ్యులు భోగాపురపు ఆదినారాయణ, అధికారులు, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

4 లక్షల కుటుంబాలకు చేరువ

జగన్ పాలనకు మద్దతుగా 49 లక్షల మిస్డ్ కాల్స్ : వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజలే ప్రభుత్వంగా.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా.. రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ద్వారా జిల్లాలో 4లక్షల కుటుంబాలకు చేరువయ్యామని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు వేలాది మంది పార్టీ సైనికులతో వైసిపి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల కుంటుంబాలకు చేరువ కాగా 49 లక్షల కుంటుంబాలు సీఎం జగనన్న పాలనకు మద్దతు పలికాయని వివరించారు.



వివరాలను వెల్లడిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

జిల్లాలో 607 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో కార్యక్రమం జరుగు తుందని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనతో తమపార్టీ కేడర్ రెట్టింపు ఉత్సాహంతో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోందని కొనియాడారు. జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో కుల, మత, ప్రాంత, వర్గ, రాజకీయ పార్టీలను చూడటం లేదన్నారు. 98 శాతం మెనిఫెస్టో అమలు చేసి సీఎం జగన్ సంక్షేమ సారథిగా నిలిచాలరన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా సరికొత్త సుపరిపాలనకు సిఎం జగన్ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. త్వరలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని కి శ్రీకారం చుడతామని, ప్రజలు నేరుగా వారి సమస్యలు చెప్పుకునే అవకాశం వస్తుందని తెలిపారు.

కాశీ ప్రత్యేక రైలుకు జిల్లాలో హాల్టులు

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ రాసిన లేఖకు రైల్వే ఉన్నతాధికారులు స్పందిస్తూ, కాశీ ప్రత్యేక రైలుకు జిల్లాలో హాల్టులు కల్పించారు. ఎంపి చంద్రశేఖర్, ఇతర ఉత్తరాంధ్ర నేతల కషితో ఇటీవలే విశాఖపట్నం నుంచి నేరుగా కాశీ వెళ్లేందుకు ప్రత్యేక రైలును వేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ రైలుకు విజయనగరం, మన్యం జిల్లాల్లో హాల్టులు కేటాయించకపోవడంతో, ఈ ప్రాంత ప్రజలు నిరాశకు గురయ్యారు. విశాఖపట్నంలో బయలుదేరే ఈ రైలు ఈ రెండు జిల్లాలను దాటుకొని, ఒడిషాలోని రాయగడలో మాత్రమే తొలుత హాల్టు కేటాయించారు. దీంతో ఈ రైలు ఎక్కాలంటే విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల ప్రజలు విశాఖపట్నం లేదా రాయగడ వెళ్లాల్సి వచ్చేది. ఈ విషయం ఎంపి బెల్లాన దృష్టికి రావడంతో, ఆయన రైల్వే బోర్డు ఛైర్మన్ అనిల్‌కుమార్ లహోటికి లేఖ రాస్తూ, జిల్లాలో హాల్టులు కేటాయించాలని కోరారు. దీంతో రైల్వే అధికారులు స్పందించి కొత్తవలస, విజయనగరం, బొబ్బిలిలో హాల్టులు కేటాయించారు. అలాగే అరకు ఎంపి గొడ్డేటి మాధవి కూడా లేఖ రాయడంతో, పార్వతీపురంలో కూడా ఈ రైలుకు హాల్టు కేటాయించారు. రెండు జిల్లాల్లో విశాఖపట్నం-బెనారస్ రైలుకు హాల్టులు కేటాయిస్తున్నట్లు శుక్రవారం సాయంత్రం రైల్వే అధికారులు ఉత్తర్వులు పంపారు.

ప్రత్యేక రైళ్లు ఇవే

కాశీ వెళ్లేందుకు 08588 నంబరు గల ఈ ప్రత్యేక రైలు ఈ నెల 19 నుంచి మే నెల 17 వరకు ప్రతీ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4.30 గంటలకు బెనారస్ చేరుతుంది. ఈనెల 20 నుంచి మే 18 వరకు ప్రతీ గురువారం 08587 నంబరు గల ఈ ప్రత్యేక రైలు బెనారస్‌లో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి, శుక్రవారం రాత్రి 8.30 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఈ రైళ్లు ఉమ్మడి జిల్లాలో కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురంలో ఆగుతాయి.

బాల్య వివాహాలను అరికట్టండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

జిల్లాలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిర్మూలనపై శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేసి పూర్తిస్థాయిలో బాల్య వివాహాలను అదుపు చేయాలన్నారు. అధికారులు ఉదాసీనంగా ఉండటం వల్ల బాల్య వివాహాల నిర్మూలన అమల్లో విఫలమవుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు.బాల్య వివాహాలు చేసిన వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మహిళా పోలీస్ సిబ్బంది తరుచుగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎంపిపి అప్పలనర్సమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలకు గల కారణాలను విశ్లేషించుకోవాలన్నారు. ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రజలకు మరింత అవగాహన పెరగాలన్నారు. మండల ప్రత్యేక అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధారాణి, జెడ్‌పిటిసి సభ్యులు శిరీష, ఎంపిడిఒ రామకృష్ణ రాజు, ఐసిడిఎస్ పిఒ రాజరాజేశ్వరి, సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి. రామకృష్ణ, ఎఒ రమణ మూర్తి, కర్లాం పిహెచ్‌సి వైద్యాధికారిణి, వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, శ్రీనివాసరావుతో పాటు పలువురు సర్పంచ్‌లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు

జివికె ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంబేద్కర్ జయంతి సందర్భంగా గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గురజాడ గ్రంథాలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు కళాకారులు, కళా బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అన్నమయ్య కీర్తన 'బ్రహ్మమొక్కటే..'కు మయూరి నృత్యాలయం నిర్వాహకులు ఎం.శ్రీదేవి ఆధ్వర్యాన నృత్య ప్రదర్శన చేశారు. గాజులరేగ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు అంబేద్కర్ పోరాటాలను వివరిస్తూ సాగే గీతానికి నృత్యం చేశారు. ఎంఆర్ కళాశాల విద్యార్థులు ఈశ్వరరావు, వెంకటరావు, సురేష్ తదితరులు అంబేద్కర్ జీవితంలోని కొన్ని ఘట్టాలను లఘు నాటికగా ప్రదర్శించారు.

అనంతరం ఉపాధ్యాయ నాయకులు కె.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సాహితీవేత్త జిఎస్ చలం మాట్లాడుతూ నేటి సమాజంలో పురాణాలు, ఇతిహాసాలను ఉదహరిస్తూ కుల, మత బేధాలను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. అన్నమయ్య అన్ని జీవులు సమానమని చెప్పారని, పోతులూరి వీరబ్రహ్మం, వేమన కుల, మత వివక్ష తగదని హితబోధ చేశారని అన్నారు. అయినా నేటికీ వివక్ష కొనసాగుతునే ఉందని అన్నారు. అనంతరం ఇండియన్ సైకాలజిస్ట్ అసోసియేషన్ సహాధ్యక్షులు ఎవి రాజశేఖర్ మాట్లాడుతూ అంబేద్కర్ సిద్ధాంతాలు, ఆవశ్యకతను వివరించారు. వేదిక కన్వీనర్ కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.



మయూరి నృత్యాలయ విద్యార్థులను అభినందిస్తున్న జివికె కన్వీనర్

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున నగరంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములునాయుడుకు డి వైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రుద్ర ప్రసాద్, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, రవి శనివారం వినతినిచ్చారు. ఎండల తీవ్రతతో ప్రజలకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు ఎక్కువగా తిరిగే కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ పార్కులలో తాగునీరు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు.

రామనాథం మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి-విజయనగరం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర రావు తండ్రి రామనాథం శనివారం విజయవాడలో మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ సంతాపం తెలిపారు.

రైతులను నిండా ముంచేసిన ప్రభుత్వం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ

ఓటేసి గెలిపించిన రైతులను వైసిపి ప్రభుత్వం నిండా ముంచేసిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి తెలిపారు. మండలంలో బడేవలస, కొంపంగి పంచాయతీలలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంటకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. విత్తనాలు, ఎరువుల ధరలు ఎన్నడూలేని విధంగా ప్రభుత్వం పెంచిందని చెప్పారు. పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కళ్లాల్లో ధాన్యాన్ని రాత్రివేళ రైతులు కాపలా కాయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. జగన్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందన్నారు.



ర్యాలీ చేపడుతున్న టిడిపి నాయకులు సంధ్యారాణి, తదితరులు

17న బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశకి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న సీనియర్స్, అండర్ 23 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక విజ్జి స్టేడియంలో జరుగుతుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం ఎల్ ఎన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు సొంత క్రికెట్‌కిట్, వైట్ డ్రెస్, జన్మ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9666818126 నంబరును సంప్రదించాలని తెలిపారు.

తోటపల్లిపై దొందూ దొందే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల రైతాంగం ఎంతో ఆశపెట్టుకున్న తోటపల్లిపై అధికార, ప్రతిపక్ష పార్టీలు దొందూ దొందే అన్న చందంగా వ్యవహరిస్తున్నాయి. ఉన్నట్టుండి ఎన్నికల ముందు, రాజకీయ అంశలు వేడెక్కినప్పుడు ఈ రెండు పార్టీలకు తోటపల్లి గుర్తుకు వస్తుంది. తామే నిర్మించామని ఒకరు, మేం లేకపోతే ఆ ప్రాజెక్టే లేదంటూ మరొకరు పరస్పర విమర్శలు చేసుకోవడం పరిపాటిగా మారుతోంది. తాజాగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్‌గజపతిరాజు, కిమిడి కళా వెంకటరావు - వైసిపి జిల్లా నేత మజ్జి శ్రీనివాసరావు మధ్య ఇదే రకమైన మాటల యుద్ధం మొదైలంది. భోగాపురం ఎయిర్‌పోర్టుపై విమర్శలు మొదలెట్టిన టిడిపి నాయకులు పనిలో పనిగా ప్రభుత్వం తోటపల్లి సాగునీటి ప్రాజెక్టుకును విస్మరించినట్టుగా విమర్శలు చేశారు. ఈ ఏడుపేదో చట్ట సభల్లోనో ప్రజాక్షేత్రంలో చేయొచ్చుకదా. అలా అయితే కనీసం ప్రభుత్వానికి చలనం రాకపోయినా ప్రజలైన పరిస్థితులు అర్థం చేసుకుంటారు కదా? అన్నది కాస్త రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారి వాదన. 64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తలపెట్టిన



తోటపల్లి ప్రాజెక్టు ఇప్పటి వరకు 80శాతం పనులు పూర్తయినమాట వాస్తవమే. కానీ, ఇంకా పిల్లకాలువలు, స్ట్రక్చర్లు, మదుములు వంటి పనులు మిగిలేవున్నాయి. దీంతో, 58,757ఎకరాలకు సాగునీరు అందించలేని పరిస్థితి దాపురించింది. నెల్లిమర్ల, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు పూర్తిగా నీరు అందడం లేదు. మిగిలిన ఆయకట్టుకు కూడా అరకొరసాగానే సాగునీరు అందుతోంది. 2017లో పూసపాటిరేగ మండలానికి నీరు అందినప్పటికీ ఆ తరువాత నుంచి రావడం లేదు. దీంతో, సుమారు 20ఏళ్లగా రైతాంగం తోటపల్లి కోసం ఎదురు చూస్తునే ఉంది. ఇందులోనూ పెండింగ్ పనులకు రూ.73.13 కోట్లే. భూమి కొనుగోలుకు రూ.3.75కోట్లు, ఆర్‌అండ్ ఆర్‌కు రూ.3.96 కోట్లు విభజించారు. ఇప్పటికే నిధులు సరిపోక కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పరిస్థితుల్లో తాజా కేటాయింపులు మరింత విస్మయానికి గురిచేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చాక తోటపల్లికి కేటాయించిన నిధులను ఒక్కసారి పరిశీలిస్తే 2019-20 రూ.156 కోట్లు కేటాయించగా, రూ.13.64కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 2020-21లో రూ.225.57కోట్లకుగాను రూ.37.27కోట్లే ఇచ్చారు. 2021-22లో రూ.199.70కోట్ల బడ్జెట్ కేటాయించగా ఆచరణలో ఖర్చుచేసింది రూ.1.35కోట్లే. 2022-23లో రూ.126.61కోట్లకు గాను రూ.4.26కోట్లు ఇచ్చారు. 2023-24లో మిగులు పనులకు రూ.294.90 కోట్లు, సిఎడి డబ్ల్యుఎం పనులకు రూ.107.69 కోట్లు, భూసేకరణకు 46.38కోట్లు, అర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.107.06 కోట్లు చొప్పున మొత్తం రూ.556.03 కోట్లు కేటాయించాలని కోరుతూ ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపారు. బడ్జెట్‌లో కేవలం రూ.80.84కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ఐదేళ్లపాటు టిడిపి తోటపల్లి కోసం మాట్లాడిన దాఖలాలు లేవు. అంతకు ముందూ అవసరానికి తగ్గట్టు నిధులు కేటాయించిన సందర్భాలు అంతకన్నా లేవు. ఇటువంటి పరిస్థితుల్లో అధికార ప్రతిపక్ష నాయకులు వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



రాగిజావ తాగుతున్న గురుకులాల జిల్లా సమన్వయకర్త చంద్రావతి

గురుకులంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను శనివారం గురుకులాల జిల్లా సమన్వయకర్త చంద్రావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, పరీక్షలు ఎలా రాశారని అడిగి తెలుసుకున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో పాటు రాగి జావ తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 23న జరిగే ప్రవేశ పరీక్షకు గురుకుల విద్యార్థులు హాజరుకావాలని సూచించారు.



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఇంటోస్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విజయభేరి

ప్రజాశక్తి-విజయనగరం

దేశ వ్యాప్తంగా 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జరిగిన ఐఎన్‌టిఎస్‌ఒ (ఇంటోస్) పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు విజయభేరి మోగించారు. జిల్లా నుంచి వెంకుమహంతి రోషన్ లాప్‌టాప్ సాధించడంతో పాటు ఏడుగురు విద్యార్థులు ట్యాబ్‌లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం బహుమతులు అందజేశారు. బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. చైతన్య విద్యాసంస్థల ఎజిఎం ఎంవి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తమ విద్యాసంస్థలకు చెందిన 95 మంది విద్యార్థులు టాప్ 5 ర్యాంకులను, 435 మంది విద్యార్థులు కన్సులేషన్ బహుమతులు, 1565 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారని తెలిపారు. చైతన్య స్కూలు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటోస్ ఫలితాల్లో ఇంతటి ఘన విజయం సాధించడానికి ఐపిఎల్, ఎంపిఎల్, ఐకాన్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్ ప్రవేశపెట్టి అంకిత భావంతో ఉపాధ్యాయులు పనిచేయడమే కారణమని అన్నారు. కార్యక్రమంలో జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ ఎ.బాలరాజు, ప్రిన్సిపాల్ ఎం.శ్రీధర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ బి.జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఎస్ఐ రాంబాబు

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని కొటారుబిల్లి జంక్షన్లో ఎస్‌బిఐ బ్రాంచ్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లో శ్రీరామచంద్ర స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈ చలివేంద్రాన్ని ఎఎస్ఐ రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేసవి తాపంతో ఉండే ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు మొదటిరోజు మజ్జిగను పంపిణీ చేశారు.

విజయనగరం టౌన్ : విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఏంజెల్ ఎన్‌జిఒ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన ఔట్ గేటు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రజా రవాణా అధికారి కె.శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, డిఎస్‌పి మోహనరావు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఆదినారాయణ, ఏంజెల్ ఎన్జీవో అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

విజయనగరం : నగరంలోని మేమున్నాం స్వచ్ఛంద సేవ సంఘం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ పైడితల్లమ్మ ఆలయం ఆవరణలో శనివారం మజ్జిగ ప్యాకెట్‌లను ఉచితంగా పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కెఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఎండ తీవ్రత విపరీతంగా ఉందని స్వచ్ఛంద సేవా సంస్థలు ఇటువంటి సమయంలో ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కంది గౌరీ కుమార్, సూరిబాబు, మురళి, డోకి చంద్రశేఖర్, కృష్ణవేణి, కంది.లత, కృష్ణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం కోట

అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం నగరంలోని పాత బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వరకు జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కె.వినయ్ ఆధ్వర్యాన సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద వాటర్ డెమో (మాక్ డ్రిల్లు) నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా అప్రమత్తం కావాలి, మంటలను ఏవిధంగా ఆర్పాలి అనే అంశాలపై మాక్‌డ్రిల్లు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ అగ్నిమాపకఅధికారి వి.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక టిటిడి కళ్యాణ మండపం సమీపంలో పేద ముస్లిములకు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ సమకూర్చిన నిత్యావసర సరుకులను వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు పంపిణీ చేశారు. పేదలకు చేయూత ఇస్తున్న రియాజ్ ఖాన్‌ను శంబంగి వేణు అభినందించారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సాక్షిగా రభస

మండల కమిటీకి తెలియకుండా చెట్ల అమ్మకాలపై నిరసన

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం మరమ్మతుల్లో భాగంగా ప్రాంగణంలో ఉన్న చెట్లను వైస్ ఎంపిపి టంకాల అచ్చెం నాయుడు, ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు మండల కమిటీకి తెలియకుండా చెట్లు నరికి వేయడం, వాటిని అమ్మకాలు చేయడం పట్ల మండల కమిటీ సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, రెడ్డి నరసింగరావు శనివారం నిరసన తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల సాక్షిగా రభస చేసి నిరసన వ్యక్తం చేశారు. దీనికి స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలోని నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వేదికగా మారింది. ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే మండల కమిటీ సభ్యులు చొరవ తీసుకుని నిరసన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం మరమ్మతులకు జనరల్, ఇతర పద్దుల నుంచి మరమ్మత్తులు చేపడుతున్నారని, పనులకు అడ్డుగా ఉంటున్నాయని చెట్లును నరికి సుమారు రూ. 5లక్షలకు అమ్మేసుకున్నారని ఆరోపించారు. మండల కమిటీకి తెలియకుండా ఇటువంటి అమ్మకాలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. భవిష్యత్తులో మండల కమిటీకి తెలియకుండా ఎటువంటి పనులూ చేపట్టరాదని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావుకు చెప్పారు. దీంతో వైస్ ఎంపిపి టంకాల అచ్చెంనాయుడు సభ మధ్యలో లేసి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా ఎంపిడిఒ అడ్డుకున్నారు. కొంతమంది సభ్యులు వారించడంతో శాంతించారు.



సభ్యులకు సర్దిచెబుతున్న ఎమ్మెల్యే జోగులు

సమగ్ర శిక్ష ఎఇపై సభ్యుల ఆగ్రహం

మనబడి, నాడు- నేడు పనులు అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టాలని మొదటి, రెండు విడతల్లో పనులు చేసినప్పటికీ ఇంతవరకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసమని సభ్యులు సమగ్ర శిక్ష ఏఈ యజ్జల దాలయ్య పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడున్నర ఏళ్ళుగా నాడు- నేడు పనులు చేపట్టినప్పటికీ చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో మధ్యలోనే నిర్మాణాలు ఆపేస్తామని సభ్యులు ఖరాకండిగా సభలో తేల్చిచేప్పేశారు. దీనిపై ఏఈ దాలయ్య సమాధానం ఇస్తూ ప్రభుత్వం నుంచి బిల్లులు వస్తే, సిమెంటు రాకుంటుందని సభలో తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహన్‌రావు, తహశీల్దార్ టీ. కళ్యాణ చక్రవర్తి, మండల నాయకులు మజ్జి శ్రీనివాసరావు, రెడ్డి నరసింగరావు, కెల్ల మన్మధరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు




బొండపల్లి.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

ప్రజాశక్తి-బొండపల్లి

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలోని జి.పి.అగ్రహారం గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం నెరవేర్చినట్లు తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. పట్రువాడ గ్రామం వద్ద చంపావతి నదిపై వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైసిపి నాయకులు బివి ప్రభూజీ, ఎంపిపి చల్లా చలంనాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాశరావు, ఎంపిడిఒ ఎ.వేదవతి, వైసిపి మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, డిటి ఆర్.శంకరరావు, సర్పంచ్ ఎస్.పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

మోదవలసలో 'జగనన్నే మా భవిష్యత్తు'

డెంకాడ : మండంలోని మోదవలస గ్రామంలో శనివారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేసి కన్వీనర్లుకు కిట్లు పంపిణీ చేశారు. అనంతరం వల్లూరు, కోమటి సత్రం, గండిబోయిన కల్లాలు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, నాయకులు కనకల రామారావు, బోణి అప్పలనాయుడు, కిట్టు, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



బిందుసేద్యం యూనిట్‌ను పరిశీలిస్తున్న పిఒ లక్ష్మీనారాయణ

సూక్ష్మసేద్యం.. రైతుకు లాభదాయకం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సూక్ష్మ సేద్యం రైతుకు ఎంతో లాభదాయకమని ఎపిఎంఐపి పిఒ టివిఎన్ లక్ష్మీనారాయణ తెలిపారు. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంట సాగు చేయవచ్చునని వివరించారు. మండలంలోని కాపు సోంపురం గ్రామానికి చెందిన రైతు మల్ల రామకృష్ణ ఏర్పాటు చేసిన బిందు సేద్యం యూనిట్లను శనివారం ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతు యూనిట్‌కి గాను 1,25,758 రూపాయలు ఖర్చు అవుతుందని, ఇందుకు రాయితీపై రూ.49,528కు మంజూరు చేస్తామని తెలిపారు. మామిడి, జీడి మామిడి, సపోటా, కొబ్బరి, ఆయిల్‌ఫామ్, కూరగాయల పంటల సాగుకు బిందు తుంపర్ల సేద్య పద్ధతులు అనువైనవని తెలిపారు. బిందు సేద్యం కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జె.సుమ, ఎంఐ ఇంజినీర్ శ్రీనివాసరావు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న చైర్మన్ మురళీకృష్ణ

భూరీసర్వే ప్రారంభం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టిన డ్రోన్ సర్వేను శనివారం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు వివాదాలు లేని ఆస్తి హక్కు కల్పించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమన్నారు. దానిలో భాగంగా అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూ రీసర్వే చేస్తున్నట్లు చెప్పారు. దళారీ వ్యవస్థకు స్వస్తి పలుకుతూ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, అవినీతికి తావులేకుండా భూ సర్వే చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. దీనికి రైతులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం : విసి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రక్తదానం ప్రాణ దానంతో సమానమని విసి ప్రొఫెసర్ జి ఎస్ఎన్‌రాజు అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. అనంతరం పలువురు అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్, సమన్వయ కర్త డాక్టర్ ఆర్ఎస్ వర్మ, నారాయణ, రషీద్, శ్రావణి, నూకరాజు, ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి డాక్టర్ శిరీష, డాక్టర్ ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

భూసారం పెరిగితే తగ్గనున్న పెట్టుబడి



వేపాడ, నెల్లిమర్ల.. మట్టి సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

భూసారం పెరిగితే రైతుకు పెట్టుబడి తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి కె.రవీంద్ర అన్నారు. మండలంలోని పోతనపల్లి రైతు భరోసా కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాల వ్యవసాయ సహాయకులకు భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలు సేకరించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి సేకరణ విధానం, భూసార పరీక్షలు, వాటి వల్ల ఉపయోగాలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి అనిత పాల్గొన్నారు.

గజపతినగరం : భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు అన్నారు. శనివారం గజపతినగరం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఎడి కె.మహారాజన్, ఎఒ సిహెచ్.ధనలక్ష్మి ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు, చిరుధాన్యాల సాగు గురించి రైతులకు అవగాహన కల్పించాలని విఎఎలను ఆదేశించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి గోవిందమ్మ మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణ, ప్రాధాన్యత, సమస్యాత్మక మట్టి నేలల యాజమాన్యం గురించి వివరించారు. అనంతరం మట్టి నమూనా సేకరణ విధాన ప్రదర్శనను క్షేత్రస్థాయిలో ప్రదర్శించారు. కార్యక్రమంలో తుమ్మికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, తహశీల్దార్ ఎం.అరుణకుమారి, ఎంపిడిఒ పి.సుదర్శన్, విఎఎలు ఎస్.కె మస్తాన్, వినయ్, జోత్స్న, ఎన్.ప్రమీల, శైలజ, రేవతి, దివ్య ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : గ్రామీణ వ్యవసాయ సహాయకులకు మట్టి నమూనా సేకరణపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎడి ఎం.శ్యామసుందర్ మాట్లాడుతూ వేసవిలో మండలంలో మట్టి నమూనాల సేకరణకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మట్టి నమూనాలు ఎలా సేకరించాలో అవగాహన కల్పించారు.

వేపాడ : ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని విఎఎలకు ఎఒ యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యాన అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. గ్రామస్థాయిలో మట్టి నమూనా పరీక్షలు చేపట్టి, వ్యవసాయ శాఖ కార్యాలయానికి అందజేయాలని ఆయన తెలిపారు.

నెల్లిమర్ల : ప్రతి గ్రామంలో భూసార పరీక్షలు నిర్వహించాలని ఎఒ ఎం. పూర్ణిమ సూచించారు. శనివారం కొండ గుంపాం ఆర్బికె పరిధిలో భూసార పరీక్షల పై రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు జరిపించుకోవాలన్నారు. ఆయా పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి భూసారం తెలుసుకొని అనుగుణంగా సాగుకి దిగాలన్నారు. భూసారం తెలుసుకోవడం ద్వారా ఎరువుల వాడకం నియంత్రణ, దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ఎం.నాగ రాజు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి, లక్ష్మీపురం, అంబాడ వెంకటాపురం, రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని 521 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాశారని ఆయా పరీక్ష కేంద్రాల డిపార్ట్మెంటల్ అధికారులు ఎం రామినాయుడు, షణ్ముఖరావు, కృష్ణారావు, రాజ్యలక్ష్మి, గురుమూర్తి, మురళీ కృష్ణ, వాసుదేవరావు తెలిపారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అనంతపురం జిల్లా నుండి విజయనగరం బదిలీపై వచ్చిన నూతన జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని శనివారం ఆమె కార్యాలంయంలో టూరిజం రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. రామతీర్థం, పుణ్యగిరి, తాటిపూడి, మన్యం జిల్లా తోటపల్లి పర్యాటకాభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. ఆమె వెంటనే స్పందించి తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడలోని పాలగెడ్డ చెరువు అభివృద్ధిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాదుల అభివృద్ధి పథకం (జైకా) సహకారంతో నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మైనర్ పాల గెడ్డ ట్యాంక్‌లో డబ్ల్యుయుఎ నీటి వినియోగదారుల సంఘం, ఆయకట్టు రైతులతో సూక్ష్మ ప్రణాళిక తయారీపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. నీడ్ సహాయక సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ జైకా నిధులతో పాలగెడ్డ రిజర్వాయర్ ఆధునీకరించే పనులు జరుగుతున్నాయన్నారు. డబ్ల్యుయుఎ పరిధిలో సూక్ష్మ ప్రణాళిక తయారు చేయడం గురించి వివరించారు. అనంతరం వెదుళ్లవలస గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి మురళీ కృష్ణ, పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజినిగిరి అచ్చుంనాయుడు, పంచాయతీ కార్యదర్శి జగదీష్, వెదుళ్లవలస సర్పంచ్ కలిశెట్టి రామకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది ఏపిలిప్-11 టీమ్, టిఒ రవికుమార్, ఎఫ్ఒ ప్రసన్నకుమారి, ప్రణయ్ పాల్గొన్నారు.

89 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వేపాడ

బొద్దాం పిహెచ్‌సిలో శనివారం డాక్టర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యాన ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విశాఖ నుంచి వచ్చిన వైద్య నిపుణులు సుమారు 89 మందికి పరీక్షలు చేశారు. 60 మందికి స్కానింగ్ చేశారు. గర్భకోశ కేన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.రామ సత్యవతి, ఎంపిటిసి పి.లక్ష్మి, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



గర్భకోశ కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సతీష్

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతిని శనివారం పేరాపురంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ రౌతు శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించడంలో ఈ ప్రభుత్వం ముందుందన్నారు. అంబేద్కర్ అందరివాడని, అలాంట విద్యావంతుడు మన దేశంలో పుట్టినందుకు మనమంతా గర్వించాలన్నారు. కెవిపిఎస్ నాయకులు తాలాడ బుజ్జిబాబు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను నెరవేరుస్తామని పాలకుల మాటల వరకే తప్ప పనుల్లో కనబడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొంతు ఉమా, పూసపాటిరేగ సర్పంచ్ టి. సీతారాం, నాయకులు మహేష్, సంకాబత్తుల సత్తిబాబు, తాలాడ కృష్ణ, యువకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు

సిఐటియు ఆధ్వర్యంలో.. పూసపాటిరేగ దళిత కాలనీలో బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి మండల తలయారుల సంఘం ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు బచ్చల సూర్యనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏలు రమణ, సీతారాం, యువకులు మహిళలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నాగావళిలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని పెదరాజుల గుమ్మడ గ్రామానికి చెందిన మిరియాల సింహాచలం(66) నాగావళి నదిలో పడి మృతి చెందాడు. గ్రామ సమీపంలోని నాగావళి నదిలో వాడరేవు వద్ద ఆయన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని నాగావళి నది నీటిలో తేలాడుతున్న మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. పెదరాజుల గుమ్మడ గ్రామానికి చెందిన మిరియాల సింహాచలంగా గుర్తించామన్నారు. ఈ నెల 14న ఉదయం నుంచి తన భర్త కనిపించలేదని నదిలో స్నానానికి దిగి ఈత రాక ఇలా కొట్టుకుపోయి మృతి చెంది ఉంటాడని మృతుని భార్య సరోజినమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో 5 షాపులు దగ్ధం

రూ.5 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని సంతగౌరమ్మపేట గ్రామంలో శనివారం సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదు షాపులు దగ్ధమయ్యాయి. సుమారు ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. ఓ మహిళ నిర్వహిస్తున్న టిఫిన్ దుకాణంలో గ్యాస్ సిలిండర్ నుంచి ప్రమాదవశాత్తు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న షాపులకూ మంటలు వ్యాపించాయి. తీడ హరిబాబుకు చెందిన సెలూన్ షాపు, గుదే గోవిందమ్మ టిఫిన్ సెంటర్, కనపరెడ్డి నరసయ్యమ్మకు చెందిన పొగాకు కట్టలు, చీపుర్లు దుకాణం, బండారు విమలకు చెందిన కిరాణా షాప్, టిఫిన్ సెంటర్, తాటితురి అర్జున్ సెలూన్ షాపులకు మంటలు వ్యాపించాయి. సుమారు రూ.5 లక్షల మేర ఆస్తినష్టం ఉంటుందని అంచనా. సమాచారం తెలుసుకుని వెంటనే సంఘటన స్థలానికి అగ్నిమాపక వాహనం చేరుకుని మంటలను అదుపు చేసినట్లు స్టేషన్ ఫైర్ అధికారి షేక్ మదీనా తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ ఆ గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గోగాడ సత్యం, గోగాడ అప్పల సత్యం ఆధ్వర్యంలో కోళ్ల లలితకుమారి ఆర్థిక సాయం చేశారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.